సాక్షి పెద్దపల్లి

శుక్రవారం : 12 : మే : 2023



జీజీహెచ్‌లో కంటి వెలుగు

కోల్‌సిటీ: జీజీహెచ్‌లో సూపరింటెండెంట్ దయాల్ సింగ్ ఆధ్వర్యంలో కంటి వెలుగు నిర్వహించారు. సిబ్బందికి పరీక్షలు చేసి అద్దాలు డిప్యూటీ డీఎంహెచ్‌వో కృపాబాయి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.



పడిపోతున్న పత్తిధర

జిల్లాలో పత్తిధరలు రోజురోజుకు పడిపోతున్నాయి. చాలా వరకు ఇళ్లలో నిల్వలు ఉన్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

10లో▸

గరిష్టం/కనిష్టం
37.0/26.0

వాతావరణం

వాతావరణం సాధారణంగా ఉంటుంది. ఎండ తీవ్రత కొనసాగుతుంది. ఉక్కపోత తీవ్రంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కాంగ్రెస్‌తోనే హక్కుల సాధన



కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాజ్ ఠాకూర్

జ్యోతినగర్(రామగుండం): కాంగ్రెస్ పార్టీతోనే హక్కులు సాధించుకోవచ్చని, ఐఎఫ్‌టీయూ నుంచి పార్టీలోకి చేరుతున్న లారీ డ్రైవర్లు, క్లీనర్లకు అండగా ఉంటానని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్ ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. గురువారం ఎన్టీపీసీ రామగుండంలోని ఓ హాలులో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎండీ.రషీద్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. డ్రైవర్లు, క్లీనర్ల సమస్యలు తనకు తెలి, అందరికీ న్యాయం చేయడానికి ముందుంటానని హామీ ఇచ్చారు. పార్టీలోకి చేరిన ఎండీ సలీం, రమణ, డేవిడ్, మృత్యుంజయం, మోసిన్, కోటయ్య, అఖిల్‌తో పాటు 100మందికి కండువాలను కప్పి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీపీసీ పట్టణ అధ్యక్షుడు ఆసిఫ్‌పాషా, టీసీసెల్ జిల్లా అధ్యక్షులు పెండ్యాల మహేశ్, మురళీకృష్ణగౌడ్, ముచ్చకుర్తి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన



వడ్లను పరిశీలిస్తున్న ఆదిరెడ్డి

కమాన్‌పూర్(మంథని): మండలంలోని సిద్దిపల్లె గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి పరిశీలించారు. ఆదిరెడ్డి మాట్లాడుతూ అకాల వర్షాలు పడుతున్న నేపథ్యంలో కేంద్రాల్లోని ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేయాలని అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. డీఏవో వెంట ఏవో ప్రమోద్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు, ఏఈవోలు యాదగిరి శ్రీనివాస్ అజ్మీరా సురేశ్, తదితరులు ఉన్నారు.

జూనియర్ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలి



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: గ్రామాల్లో అనేక రకాల విధులను నిర్వర్తిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల న్యాయమైన డిమాండ్లను ఆమోదించి వెంటనే వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు డిమాండ్ చేశారు. కార్యదర్శుల దీక్షాశిబిరాన్ని గురువారం సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఉద్యోగులు, కార్మికులను తొలగించే హక్కు ప్రభుత్వాలకు లేదని, ప్రభుత్వమే బెదిరింపులకు దిగడం సరికాదన్నారు. సమ్మె విరమణకు పాలకులు చొరవ చూపాలన్నారు. నాయకులు జ్యోతి, ఖాజా, తిరుపతి, అశోక్ ఉన్నారు. అలాగే బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీమాన్, ప్రశాంత్, రాము, అశోక్, తిరుమల్ తదితరులు కూడా సమ్మెకు మద్దతు ప్రకటించారు.

వైభవంగా నాగలింగేశ్వర ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు



విగ్రహప్రతిష్ఠాపనోత్సవాల్లో పీఠాధిపతి విద్యాశంకరభారతీ మహాస్వామి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాగినేడు గ్రామంలో స్వయంభుగా వెలసిన శ్రీనాగలింగేశ్వరస్వామి ఆలయంలో దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు పుష్పగిరి పీఠాధిపతి విభూషిత విద్యాశంకర భారతీ మహాస్వామి ఆధ్వర్యంలో గురువారం మూలమంత్ర హోమం, ప్రత్యేక పూజలు జరిగాయి. మండప పూజలు, మూలమంత్రజపములు, కుమండప పూజలు, పుష్ప, ఫల శయ్యాదివాసము తదితర పూజా కార్యక్రమాల్లో రాష్ట్ర పోలీస్‌హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ దంపతులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు. శుక్రవారం యంత్రస్థాపన, శివకల్యాణం నిర్వహిస్తున్నట్లు కోలేటి దామోదర్ తెలిపారు.

తరుగు పేరిట దోపిడీ



మాకు ఉన్న పొలంతోపాటు 8 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేశాం. చేతికొచ్చిన పంటను నెలరోజుల క్రితం సెంటర్‌లో ఆరబోసినం. వర్షాలు పడుతుండటంతో సద్ది తెచ్చుకొని ఇక్కడే తింటూ ధాన్యం తడవకుండా కాపాలకాస్తున్నాం. తేమ, తాలు పేరుతో తరుగు పెడుతున్నారు. వచ్చినకాడికి అమ్ముకుందామన్నా మిల్లర్లు ధాన్యం దించుకోవటం లేదని కాంటాలు పెట్టడం లేదు.

– బాలసాని రాజమణి, సుద్దాల



పెద్దపల్లి మండలంలో ఆరబోసిన ధాన్యం

- తొలుత కొనుగోలు కేంద్రాల్లో, తరువాత మిల్లుల్లో చేతివాటం
- తేమ, గడ్డి, మట్టిబెడ్డల పేరుతో 2 కిలోలు తరుగు
- అదే కారణంతో మిల్లులలో మరోసారి ధాన్యం కోత
- క్వింటాలుకు తొమ్మిది కిలోలకుపైగా వడ్లకు కన్నం
- కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, మిల్లర్లు కుమ్మక్కు?

జిల్లా	సాగు (ఎకరాల్లో)	దిగుబడి అంచనా (మె.టన్నుల్లో)
కరీంనగర్	2,71,388	7.5 లక్షలు
పెద్దపల్లి	2,00,033	4 లక్షలు
జగిత్యాల	2,97,638	7 లక్షలు
సిరిసిల్ల	1,71,008	3 లక్షలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: వడగండ్ల గండాలు దాటి మిగిలిన పంటను కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన రైతులు రకరకాలుగా దోపిడీకి గురవుతున్నారు. కోతల పేరుతో మిల్లర్లంతా ఏటా రూ.వందల కోట్ల దందా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చేస్తున్న విషయం తెలిసిందే. మొన్నటి దాకా అకాల వర్షాలు, వడగండ్లతో చాలావరకు పంటనష్టం జరిగింది. చివరికి చేతికి వచ్చిన పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే.. తేమ, గడ్డి, తాలు ఉందంటూ రకరకాల కారణాలు చెప్పి రెండు కిలోల మేర తరుగు తీస్తున్నారు. వాస్తవానికి 40.600 కిలోల బస్తా కోసం 650 గ్రాముల (సంచి బరువు)కు మించి తరుగు తీయవద్దన్న నిబంధనను ఉమ్మడి జిల్లాలో ఎవరూ పెద్దగా పట్టించుకోవడం లేదు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు–మిల్లర్లు కలిసే ఈ దందా చేస్తున్నారని అన్నదాతలు మండిపడుతున్నారు.

క్వింటాలుకు ఎనిమిది కిలోలు

ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల్లో తేమ సాకుతో చాలామంది మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారు. అకాల వర్షాలు, వడగండ్ల కారణంగా చాలా చోట్ల కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం కుప్పలు తడిసిన విషయం తెలిసిందే. గత వంద ఏళ్లలో ఎన్నడూ చూడని విపత్తును ఇటీవల రైతులు ఎదుర్కొన్నారు. కల్లాల్లోని ధాన్యం ఇంకా ఆరనే లేదు. 20శాతం వరకు తేమ ఉన్నా కొంటామని ప్రభుత్వం చెప్పినా.. క్షేత్రస్థాయిలో ఈ నిబంధన ఉల్లంఘనకు గురవుతోంది. తేమతోపాటు వరిధాన్యంలో మట్టిబెడ్డలు, గడ్డి, తాలూ ఉన్నాయంటూ సాకులు చెబుతూ.. కొనుగోలు కేంద్రంలో బస్తాకు రెండు కిలోలు తరుగు తీస్తున్నారు. అనంతరం మిల్లుకు వెళ్లిన ధాన్యం తూకం ఎంట్రీ చేసే సమయంలో మరో రెండు కిలోల చొప్పున కోత పెడుతున్నారు. మొత్తంగా క్వింటాలుకు రెండు నుంచి తొమ్మిది కిలోల చొప్పున ధాన్యం తరుగు తీస్తున్నారు. ఇదేం అన్యాయమని నిలదీసిన రైతుల ధాన్యం కొనమని తెగేసి చెబుతున్నారు.

పెద్దపల్లిలో ప్రారంభం కాని కొనుగోళ్లు..

సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్‌లో తరుగు మోసాలు నడుస్తుంటే పెద్దపల్లిలో మాత్రం కథ మరోలా ఉంది. జిల్లాలో ప్రభుత్వం 300 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, వాటి ద్వారా సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని నిర్ణయించింది. కానీ.. క్షేత్రస్థాయిలో కొనుగోళ్లు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు కేవలం 62,245 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. క్వింటాకు 6 నుంచి 7 కిలోల తరుగుకు ఒప్పుకుంటేనే కొనుగోలు చేస్తున్నారని అన్నదాతలు వాపోతున్నారు. తరుగు లేకుండా మిల్లర్స్‌కు తరలించిన ధాన్యాన్ని మిల్లర్లు దించుకోవడం లేదు.

రెండున్నర కిలోలు అధికం



నాకు నాలుగెకరాల వ్యవసాయ పొలం ఉంది. ఆ భూమిలో దాదాపు 58 క్వింటాళ్ల వడ్లు అయ్యాయి. వాస్తవానికి ప్రతీసారి 120 క్వింటాళ్లు దిగుబడి వచ్చేది. కానీ.. ఈసారి వడగళ్లు, అకాల వర్షాల కారణంగా దిగుబడి పడిపోయింది. తేమ 17శాతం ఉంటేనే కొంటున్నారు. మా వద్ద బస్తాను 40 కిలోలకు రెండున్నర కిలోలు అదనంగా తూకం వేస్తున్నారు.

– మాదుగుల లింబాద్రి, సిరిసిల్ల

కోతలు పెడితే మిగిలేదేంటి



రెండున్నర ఎకరాల్లో వరి వేస్తే వచ్చిన దిగుబడే తక్కువ. 70 క్వింటాళ్ల ధాన్యం వస్తదనుకుంటే మాయదారి వానతో సగం కూడా రాలేదు. ఇప్పుడు అమ్మితే బస్తాకు 2 కిలోలు కోత పెడుతున్నారు. ఇదెక్కడి న్యాయం. ఈసారి వానలతోటి నష్టపోయినం. ఇప్పుడు కొనుగోలు కేంద్రాలల్ల నష్టపోతున్నం. – లక్ష్మి, గంగాధర

ఎఫ్ఎస్‌టీపీపై ట్విటర్‌లో మంత్రి కేటీఆర్ హర్షం



ట్విటర్‌లో స్పందించిన మంత్రి కేటీఆర్

కోల్‌సిటీ (రామగుండం): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని మల్కాపూర్ శివారులో కొత్తగా నిర్మించిన ఫీకల్ స్లడ్జ్ ట్రీట్మెంట్ ప్లాంట్ (ఎఫ్ఎస్‌టీపీ)పై ట్విటర్‌లో పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ అభినందనలు తెలిపారు. ఫీకల్ స్లడ్జ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ఏర్పాటుకు నాలెడ్జ్‌పార్టనర్‌గా ఉన్న అడ్మినిస్ట్రేటివ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కీ) సంస్థ, ఈ ప్లాంట్ ఫొటోలను, వీడియోలను ట్విటర్‌లో ఉంచింది. దీనికి స్పందించిన మంత్రి కేటీఆర్ వాటిని ఫార్వర్డ్ చేశారు. రూ.3.80 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ప్లాంట్‌ను కేటీఆర్ స్వయంగా సందర్శించి ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ, సమయాభావంతో ఈనెల 8న గోదావరిఖని జంక్షన్‌లో ఏర్పాటు చేసిన ప్రగతి పైలాన్ దగ్గరే ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కాగా, ఈ ప్లాంట్‌ను కేటీఆర్ స్వయంగా సందర్శించకున్నప్పటికీ, ప్లాంట్ ఫొటోలను ట్విటర్‌లో షేర్ చేసి అభినందనలు తెలపడంతో అధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రైతులను ఆదుకోవాలి

పెద్దపల్లిరూరల్: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రాజేందర్, అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోశ్‌తో కలిసి మాట్లాడారు. పంట నష్టపోయిన రైతుకు ఎకరానికి రూ.10వేలు ఇస్తామని ప్రకటించినా ఇప్పటికీ అందలేదన్నారు. తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని కొనాలన్నారు. ఈనెల 14న కరీంనగర్‌లో తలపెట్టిన హిందూఏక్తాయాత్రను విజయవంతం చేయాలన్నారు.

పెద్దనాన్న దగ్గరుంటే బతికేది..

- మద్యానికి బానిసై.. సైకోగా మారిన సదానందం
- అదే మత్తులో కూతురును గొడ్డలితో నరికిన వైనం
- కంటతడి పెట్టిన భట్టుపల్లి గ్రామం



రజిత(ఫైల్)

మంథని: పట్టుమని పదేళ్లు కూడా లేవు. ఆడుతూ పాడాల్సిన వయసులో తల్లిప్రేమకు దూరమైనా.. తండ్రి, అన్నకు ఇంటి సపర్యలు చేస్తూ వచ్చింది. గ్రామంలోని అందరినీ తనవాళ్లే అనుకుంటూ.. వరుసపెట్టి పిలిచే చిన్నారి ఇక లేదంటూ భట్టుపల్లి ఘొల్లుమంది. మద్యానికి బానిసై సైకోగా మారిన తండ్రి గొడ్డలివేటుకు కానరాని లోకాలకు వెళ్లిపోయిన రజితను తలుచుకుంటూ గ్రామస్తులు కన్నీరు పెడుతున్నారు. నిందితుడిని ఎన్‌కౌంటర్ చేయాలని ఆరుగంటలపాటు ఆందోళనకు దిగారు.

తల్లిమరణంతో పెద్దనాన్న చెంతకు..

మంథని మండలం భట్టుపల్లి గ్రామానికి చెందిన గుండ్ల సదానందం మద్యానికి బానిసై సైకోగా మారి ఏ పని లేకుండా తిరుగుతున్నాడు. భార్య శ్రీలత కూలీనాలి చేసి కొడుకు అంజి, కూతురు రజిత(10)ను పోషించుకుంటూ వచ్చింది. సదానందం ఆగడాలు మితిమీరిపోవడంతో తట్టుకోలేక ఎనిమిది నెలల క్రితం ఉరివేసుకుని శ్రీలత తనువు చాలించింది. అంజి గ్రామంలో దొరికిన పని చేసుకుంటూ బతుకుతున్నాడు. ఇంట్లో ఆడదిక్కు లేకపోవడంతో రజితను ఆమె పెద్దనాన్న సాదుకుంటానని తీసుకెళ్లాడు. కొద్దిరోజుల పాటు అతని దగ్గరే ఉంది. ఇటీవలే తండ్రి దగ్గరకు వచ్చింది. పెద్దనాన్న ఇంట్లో ఉంటే రజిత ప్రాణాలు దక్కేవని గ్రామస్తులు చెబుతున్నారు. తల్లి మరణం తర్వాత కూతురు రజిత ఇంటి పనులు చక్కగా చేసేదని, పనులు ముగించుకొని బడికి వెళ్లేదని, చదువులో చురుగ్గా ఉండే రజిత ఐదోతరగతి చదువుతోందని, పదేళ్లకే నూరేళ్లు నిండాయని గుర్తు చేసుకున్నారు.



పోలీసులపై దాడి చేస్తున్న గ్రామస్తులు

మద్యం ఇవ్వనందుకే దాడి

గురువారం ఉదయం మద్యం మత్తులో సదానందం ఇంటికి వచ్చాడు. ఏం జరిగిందో తెలియదు కానీ.. కూతురు రజితను గొడ్డలితో నరికి చంపాడు. అదే గొడ్డలితో గ్రామంలోని దూపం శ్రీనివాస్ ఇంటికి వెళ్లాడు. బెల్ట్‌దుకాణం నిర్వహించే శ్రీనివాస్‌ను మద్యం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఆయన నిరాకరించడంతో గొడ్డలితో దాడి చేశాడు. తప్పించుకునే క్రమంలో ముక్కు, కన్ను పక్క భాగం, నొసలుపై గొడ్డలివేటు పడింది. కరీంనగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీనివాస్‌కు 15కుట్లు పడ్డాయి.

ఊరంతా ఒక్కటై..

సదానందం గతంలోనూ గ్రామానికి చెందిన రెడ్డి రాజేశం అనే వ్యక్తితో పాటు చాలామందిపై దాడి చేశాడు. ఈ క్రమంలో కన్న కూతురునే చంపిన సదానందంను తమ కళ్లముందే ఉరితీయాలని గ్రామస్తులంతా ఒక్కటయ్యారు. పోలీసులకు ఎదురు తిరిగారు. పలువురిపై దాడికి సైతం దిగారు.

మా కళ్ల ముందే చంపాలే



ఊళ్లె ఎంతో మంది మీద దాడి చేసిండు. ఎందరో ఆడోళ్ల మీద అఘాయిత్యం చేయబోయిండు. గిప్పు డు కన్న కూతురును చంపిండు. అట్లాంటోడు బతికి ఉండొద్దు. మా కళ్ల ముందే ఎన్‌కౌంటర్ చేయాలే. లేకుంటే మాకు వదిలిపెట్టాలే.

– ఊటుకూరి సరోజన, భట్టుపల్లి

నాపైనే ఫిర్యాదు చేస్తావా.. నీ అంతు చూస్తా!

- పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రిలో స్టాఫ్‌నర్సు నిర్బంధం
- ఫిర్యాదు చేస్తుందనే భయంతో నర్సింగ్ సూపరింటెండెంట్ నిర్వాకం
- సూపరింటెండెంట్ ఆఫీసులో ఉన్నతాధికారుల విచారణ



లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తున్న సమీరా

పెద్దపల్లిరూరల్: 'నాపైనే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తావా.. నీ అంతుచూస్తా.. చర్మం ఒలిచి చెప్పులు కుట్టిస్తా' అంటూ పెద్దపల్లిలోని మాతాశిశు కేంద్రంలో కాంట్రాక్టు పద్ధతిలో స్టాఫ్‌నర్స్‌గా పనిచేస్తున్న సమీరా బేగంపై నర్సింగ్ సూపరింటెండెంట్ జమున ఆగ్రహం వ్యక్తం చేశారు. సెల్‌ఫోన్ లాక్కొని దుర్భాషలాడుతూ గదిలో నిర్బంధించారు. డ్యూటీల కేటాయింపు విషయంలో కొద్దిరోజులుగా నర్సింగ్ సూపరింటెండెంట్‌కు స్టాఫ్‌నర్సుల మధ్య భేదాభిప్రాయాలు ఉన్నాయి. స్టాఫ్‌నర్సులు తమ ఆవేదనను ఉన్నతాధికారులకు చెప్పాలనుకుంటున్న విషయం నర్సింగ్ సూపరింటెండెంట్‌కు తెలిసింది. దీంతో ఆగ్రహావేశానికి లోనై నిర్బంధానికి పాల్పడినట్లు తెలుస్తోంది. గదిలో బంధించడంతో సమీరా రోదిస్తోందని తెలుసుకున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ శౌరయ్య, ఆసుపత్రుల సూపరింటెండెంట్ శ్రీధర్ సమీరా, జమునను పిలిపించి విచారించారు. 'నాకే ఎదురు తిరుగుతావా.. నిన్ను ఉద్యోగంలోంచి తీసేస్తానంటూ' నర్సింగ్ సూపరింటెండెంట్ బెదిరించిందని స్టాఫ్‌నర్సు సమీరా రోదించింది. అందరం కలిసే తమ ఆవేదనను మీ దృష్టికి తేవాలనుకున్నామని, ఇంతలో మిగతా స్టాఫ్‌నర్సులతో మరో ఫిర్యాదు రాయించుకుందని డీసీహెచ్‌ఎస్ శ్రీధర్, సూపరింటెండెంట్ శౌరయ్య ఎదుట సమీరా వాపోయింది. ఈ విషయమై జమునను వివరణ కోరగా.. 'నిబంధనల ప్రకారం డ్యూటీలు వేస్తే అనవసరంగా నాపై బురద చల్లేందుకు సమీరా యత్నిస్తోంది. నేను ఆమెను ఏమీ అనలేదు. నిర్బంధించలేదు' అని సమాధానం ఇచ్చారు. దీనిపై డీసీహెచ్‌ఎస్ శ్రీధర్ స్పందిస్తూ.. 'డ్యూటీల కేటాయింపు విషయంలో తలెత్తింది చిన్న సమస్య. ఇరువురితో మాట్లాడి పరిష్కారం చూపుతా. నర్సింగ్ సూపరింటెండెంట్‌గా ప్రభావతిని నియమించేలా చూస్తా. కలెక్టర్ ఆర్డర్‌తో ఉద్యోగంలో చేరిన సమీరాను తీసేసే అధికారం నర్సింగ్ సూపరింటెండెంట్‌కు లేదు' అని సమాధానం ఇచ్చారు.

గంజాయి అక్రమరవాణాపై పటిష్ట నిఘా

- ప్రజల మన్ననలు పొందేలా సేవలందించాలి
- రామగుండం పోలీస్‌కమిషనర్ రెమా రాజేశ్వరి



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న సీపీ రెమా రాజేశ్వరి

గోదావరిఖని(రామగుండం): సమాజాన్ని పట్టిపీడిస్తున్న గంజాయి అక్రమ రవాణాపై పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని రామగుండం పోలీస్‌కమిషనర్ రెమా రాజేశ్వరి పేర్కొన్నారు. పోలీస్‌కమిషనరేట్ భవనంలో గురువారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన 500మంది పోలీస్ అధికారులు, సిబ్బందికి రివార్డులు అందించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ విజయవంతం చేసినవారికి అభినందనలు తెలిపారు. కమిషనరేట్ నుంచి మారుమూల ప్రాంతాల వరకు నేరాల నియంత్రణ, ప్రజల రక్షణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు నూతన భవనం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యుత్, నీటిని పొదుపుగా వాడాలని సూచించారు. బిల్డింగ్ నిర్వహణకు పలు విభాగాల అధికారులతో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటుపై అధికారులతో సమీక్షించారు. గత రెండు నెలల్లో 648 గ్రామాలు, 110 హామ్లెట్ గ్రామాల్లో 2,978 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా అన్ని విభాగాలను కమిషనరేట్‌లో ఒకేచోట ఉండేలా ఏర్పాటు చేసినట్లు సీపీ తెలిపారు. సైబర్‌క్రైం వింగ్, లీగల్‌సెల్, ఫింగర్‌ప్రింట్(ఎఫ్‌పీయూ), కాల్‌డేటా రికార్డ్స్(సీడీఆర్), అనాలిసిస్‌వింగ్, ఐటీకోర్‌టీం, కమిషనరేట్ క్రైం రికార్డ్‌బ్యూరో(సీసీఆర్‌బీ), పోలీస్‌కంట్రోల్‌రూం(పీసీఆర్), ఐటీఅండ్‌కమ్యూనికేషన్‌వింగ్, టాస్క్‌ఫోర్స్, కమిషనరేట్ స్పెషల్ బ్రాంచ్(సీఎస్‌బీ),కమాండ్‌కంట్రోల్‌రూం, యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ యూనిట్, పబ్లిక్ గ్రీవెన్స్, పాస్‌పోర్టు అప్లికేషన్ రిసెప్షన్ సెంటర్ అన్నీ ఒకే చోట ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో పెద్దపల్లి డీసీపీ వైభవ్‌గైక్వాడ్, మంచిర్యాల డీసీపీ సుధీర్‌కేకెన్, ఏఆర్ అడిషనల్ డీసీపీ రియాజ్‌ఫుల్‌హక్, ఏసీపీలు, సీఐలు, ఆర్ఎస్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు పాల్గొన్నారు.











భానుడి భగభగ.. జనం విలవిల

జిల్లాలో పక్షం రోజులుగా చల్లబడిన భానుడు రెండు, మూడు రోజులుగా భగభగలాడుతున్నాడు. ఉదయం ఎనిమిది గంటలకే ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ఉక్కపోత.. పదిగంటల వరకే దంచికొడుతున్న ఎండలతో జనాలు విలవిల్లాడుతున్నారు. పదకొండు అయ్యిందంటే బయటకు రావడానికి జంకుతున్నారు. దీంతో కూలర్లు, ఏసీలకు డిమాండ్ ఏర్పడగా.. గిరాకీ పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. మధ్యాహ్నం ఎండతాకిడికి మంచినీళ్లు, పానీయాలు తీసుకుంటూ ఉపశమనం పొందుతున్నారు. వారంరోజుల పాటు ఎండల తీవ్రత కొనసాగే అవకాశం ఉందని, ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు ఇంటికే పరిమితం కావాలని చెబుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

క్లుప్తంగా

సుల్తానాబాద్‌లో చికెన్ సెంటర్ సీజ్



చికెన్ సెంటర్‌లో పరిశీలిస్తున్న కమిషనర్

సుల్తానాబాద్(పెద్దపల్లి): పట్టణంలోని పుసాల రోడ్డులో దుర్వాసన వస్తున్న, అధిక మొత్తంలో వ్యర్థాలను నిల్వ ఉంచిన ఓ చికెన్ సెంటర్‌ను మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ గురువారం సీజ్ చేశారు. చికెన్ సెంటర్లలో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన ఆయన పలు దుకాణాలు అపరిశుభ్రంగా ఉండటాన్ని గుర్తించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచడంతోపాటు నిత్యం బ్లీచింగ్ పౌడర్ చల్లాలని చెప్పారు. దుర్వాసన వస్తోందని ఫిర్యాదులు అందుతున్నాయని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. భవిష్యత్‌లో ఇలాగే కొనసాగితే భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు. రోడ్ల వెంట చికెన్ వ్యర్థాలను వేయొద్దన్నారు. మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది శ్రావణ్ తదితరులున్నారు.

ఎన్టీపీసీ 'కాంట్రాక్టు' చర్చలు మరోసారి వాయిదా

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికుల వేతన ఒప్పందంపై జరిగిన చర్చలు మరోసారి వాయిదా పడ్డాయి. గురువారం ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు పరిపాలనా భవనం హాలులో జరిగిన చర్చల్లో యాజమాన్యం ప్రతినిధులు, కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు హాజరవగా కాంట్రాక్టర్లు రాలేదు. దీంతో చర్చలను వాయిదా వేశారు. తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని యాజమాన్యం తెలిపినట్లు కార్మిక నాయకులు వెల్లడించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపక అధికారి దేవనంది శ్రీనివాస్ గురువారం అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే అందుబాటులో ఉన్న పరికరాలతో మంటలను అదుపు చేసే విధానాన్ని వివరించారు. ఫైర్ సిబ్బంది సిరాజుద్దీన్, శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, నరేందర్ తదితరులున్నారు.

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

ఎలిగేడు(పెద్దపల్లి): మండల కేంద్రంలో పెద్దపల్లి ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు ఎస్సై మనీషారాథోడ్ తన సిబ్బందితో కలిసి గురువారం గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. 5 లీటర్ల గుడుంబా, కిలో పటిక స్వాధీనం చేసుకున్నారు. 100 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. నాటుసారా తయారీ, విక్రయాలు జరుపుతున్న కోట భూదమ్మ, రాజయ్యలను అరెస్టు చేసి, తహసీల్దార్ నాగరాజమ్మ ఎదుట బైండోవర్ చేశారు. గుడుంబా తయారు చేసినా, విక్రయించినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శరత్, కానిస్టేబుళ్లు దిలీప్, మోసెస్, కార్తీక్ పాల్గొన్నారు.

పడిపోతున్న పత్తి ధర

- రూ.6,500కు తగ్గిన వైనం
- ఇంకా ఇళ్లలోనే నిల్వలు
- వ్యాపారులు సిండికేట్‌గా మారారంటున్న రైతులు
- అమ్ముకుందామంటే దోచుకుంటున్నారని ఆవేదన
- జిల్లాలో 63,182 ఎకరాల్లో సాగు



'ఈ ఫొటోలో ఉన్న రైతు పేరు రాపెల్లి తిరుపతి. ఊరు పెద్దపల్లి. గురువారం మార్కెట్‌కు 15 క్వింటాళ్ల పత్తి తీసుకువచ్చాడు. అందులో మూడు క్వింటాళ్ల వరకు రంగుమారి ఉండటంతో వేరుగా ఉంచాడు. అయితే నాసిరకంగా ఉన్న పత్తికి 17 శాతం తేమ రాగా క్వింటాల్‌కు రూ.6,700గా.. మేలురకం పత్తికి 16 శాతం తేమరాగా క్వింటాల్‌కు రూ.6,500గా ధర నిర్ణయించారు. ఈ వ్యత్యాసాన్ని గమనించే వ్యాపారులందరూ సిండికేట్‌గా మారి, ధరలు తగ్గించారంటూ రైతులు మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట బైఠాయించి, నిరసన తెలిపారు. పత్తిని అమ్ముకుందామంటే దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.'

పెద్దపల్లిరూరల్: పత్తి ధర రోజురోజుకూ పడిపోతోంది.. ఈ సీజన్‌లో మంచి ధర పలకడంతో ఇంకా పెరుగుతుందన్న ఆశతో రైతులు పత్తిని ఇప్పటికీ తమ ఇళ్లలోనే నిల్వ చేసుకున్నారు. అయితే అనూహ్యంగా ధర పతనమవుతుండటంతో వారు ఆందోళన చెందుతున్నారు.

మొదట్లో రూ.9 వేలు..

పెద్దపల్లి మార్కెట్‌యార్డు ఆవరణలో గతేడాది అక్టోబర్ 28 నుంచి పత్తి కొనుగోళ్లు మొదలయ్యాయి. ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా రైతులు 63,182 ఎకరాల్లో పత్తిని సాగు చేశారు. కొనుగోళ్లు ప్రారంభమైన రోజు రూ.9 వేలు ధర పలికింది. కానీ ఆ తర్వాత తగ్గుతూనే వస్తోంది. దీంతో పత్తిని ఇళ్లలో దాచుకున్న రైతులు తమ అవసరాలను తీర్చుకునేందుకు కొద్దికొద్దిగా అమ్ముకుంటున్నారు. ఇప్పటికీ పూర్తిస్థాయిలో విక్రయించాలా.. వద్దా అన్న సందిగ్ధంలోనే ఉన్నారు.



గురువారం పెద్దపల్లి మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట బైఠాయించిన రైతులు

ధరలు గిట్ల తగ్గుతయనుకోలే..



నేను ఐదెకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి పంట పండించిన. మొదట్లో ఎక్కువ ధర ఉండటంతో ఇంకింత పెరగకపోద్దా అనుకున్న. కానీ గిట్ల తగ్గుతదనుకోలే. 10 క్వింటాళ్ల పత్తిని మార్కెట్‌కు తెచ్చిన. ఇంకా ఇంట్లో 15 క్వింటాళ్లకు పైనే ఉంది. ఏం చేయాలో అర్థమైతలేదు.

– కొమ్ము బాపు, జూలపల్లి

పత్తి గింజలకు తగ్గడం వల్లే..



మార్కెట్‌లో పత్తి గింజలకు ధర తగ్గింది. దాని ప్రభావం పత్తిపై పడటం వల్లే ధరలు తగ్గుతున్నాయి. మార్కెట్‌లో వ్యాపారులు సిండికేట్‌గా మారడమే దీనికి కారణమన్న ఆరోపణల్లో నిజం లేదు. పత్తి కొనుగోళ్లు ఆన్‌లైన్‌లో ఈ–నామ్ పద్ధతిలోనే పారదర్శకంగా జరుగుతున్నాయి.

– దేవరాజ్ పృథ్వీరాజ్, మార్కెట్ కమిటీ కార్యదర్శి

11 మంది ఎస్సైల బదిలీ

గోదావరిఖని(రామగుండం): రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో 11 మంది ఎస్సైలు బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం సీపీ రెమా రాజేశ్వరి ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన ఎస్సైల వివరాలు ఇలా ఉన్నాయి..

ఎస్సై పేరు	ప్రస్తుతం	బదిలీ
ఎస్.రవికుమార్	వీఆర్ మంచిర్యాల్	ఎస్‌హెచ్‌వో, బెల్లంపల్లి–2
ఎ.ఆంజనేయులు	బెల్లంపల్లి–2	ఎస్‌హెచ్‌వో, దేవాపూర్
ఎ.విజేందర్	దేవాపూర్	ఎస్‌హెచ్‌వో, సుల్తానాబాద్
ఎ.మహేందర్	పొత్కపల్లి	ఎస్‌హెచ్‌వో, పెద్దపల్లి
కె.రాజేశ్	పెద్దపల్లి	ఎస్‌హెచ్‌వో, శ్రీరాంపూర్
ఎం.మానస	శ్రీరాంపూర్	వీఆర్, మంచిర్యాల్
కె.రామకృష్ణ	టాస్క్‌ఫోర్స్ మంచిర్యాల్	ఎస్‌హెచ్‌వో, పొత్కపల్లి
బి.సమ్మయ్య	సీసీఎస్, పెద్దపల్లి	గోదావరిఖని–1టౌన్
ఎస్.వెంకటేశ్	గోదావరిఖని–1టౌన్	ఎస్‌హెచ్‌వో, బసంత్‌నగర్
టి.శ్రీనివాస్	బసంత్‌నగర్	ఎస్‌హెచ్‌వో, కాల్వశ్రీరాంపూర్
కె.మౌనిక	పెద్దపల్లి–2	సీసీఆర్‌టీ, మంచిర్యాల్

చికిత్స పొందుతూ మహిళ మృతి

- ఈ నెల 6న కారు ఢీకొని తీవ్రంగా గాయపడిన ధర్మారంవాసి



దేవేంద్ర (ఫైల్)

ధర్మారం(ధర్మపురి): మండల కేంద్రానికి చెందిన వేంపల్లి దేవేంద్ర చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వేంపల్లి సత్తయ్య తన భార్య దేవేంద్ర, మనవడు, మనవరాలితో కలిసి ఈ నెల 6న ఖిలావనపర్తిలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకున్నారు. మోటార్ సైకిల్‌పై తిరిగి ఇంటికి వెళ్తుండగా నందిమేడారం పెట్రోల్ బంకు సమీపంలో ఓ కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న నలుగురూ తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రితో చేర్పించగా దేవేంద్ర చికిత్స పొందుతూ గురువారం చనిపోయినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతురాలి కూతురు పల్లె మనస్విని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మిల్లర్లు కొర్రీలు పెడుతున్నరు

- సమస్య పరిష్కరించండి
- కలెక్టర్, డీసీవోలకు సహకార సంఘాల చైర్మన్ల వినతి

పెద్దపల్లిరూరల్: కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని తీసుకోకుండా మిల్లర్లు కొర్రీలు పెడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని జిల్లాలోని సహకార సంఘాల చైర్మన్లు ఆరోపించారు. గురువారం కలెక్టర్ సంగీత, డీసీవో మైఖేల్ బోస్‌లను కలిసి, సమస్య పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు అందించారు. మిల్లర్లు ధాన్య శాతం రాదంటూ ప్రతీ ధాన్యం లారీ విషయంలో పేచీ పెడుతున్నారని అన్నారు. గన్నీ సంచులను తక్కువగా పంపుతున్నారని పేర్కొన్నారు. గన్నీ సంచులు కటింగ్ చేస్తున్నందున పాత సంచులకు కొత్త ధర కడుతున్నారని తెలిపారు. ధాన్యం గ్రేడ్ నిర్ధారణ విషయంలో పొరపాట్లు జరగకుండా చూడాలని విన్నవించారు. కార్యక్రమంలో చైర్మన్లు బలరాంరెడ్డి, మనోహర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, చంద్రారెడ్డి, శ్రీనివాస్, రాజిరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, రాజమల్లారెడ్డి, భాస్కర్‌రావు, వేణుగోపాల్‌రావు, ప్రభాకర్ పాల్గొన్నారు.



డీసీవో మైఖేల్ బోస్‌తో సమావేశమైన చైర్మన్లు

పదోతరగతి ఫలితాల్లో 'ట్రినిటీ' సత్తా



విజయసంకేతం చూపుతున్న చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటీ పాఠశాల విద్యార్థులు పదోతరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణతతో సత్తా చాటారు. రిషి, శశికాంత్, సూర్యతేజ, విజయ్‌కుమార్, అశ్విత, హరిణి, హిమాని, మల్లిక, మనస్విని, నాగజ్యోతిక, సహస్ర, సాయి, అక్షయ్, సాయిహర్షిణి, సంజన తదితర 32 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారని విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. 33 మంది 9.8 జీపీఏ, 46 మంది 9.7, 33 మంది 9.5, 40 మంది 9.3, 38 మంది 9.2, 23 మంది 9 జీపీఏ సాధించారన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను గురువారం ఆయన అభినందించారు. ఉపాధ్యాయుల ఉత్తమ బోధనతో ఏటా రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధిస్తున్నామని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ రమేశ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జ్యోతిబాపూలే గురుకుల విద్యార్థుల ప్రతిభ



విశ్వాస్ (9.8 జీపీఏ)



ప్రేమస్ (9.7 జీపీఏ)

గోదావరిఖనిటౌన్(రామగుండం): స్థానిక సప్తగిరికాలనీలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు 10వ తరగతి ఫలితాలలో ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ డి.శ్రీకాంత్ గురువారం తెలిపారు. డి.విశ్వాస్ 9.8 జీపీఏ, ఆర్.ప్రేమస్ 9.7 జీపీఏ, నలుగురు 9.5 జీపీఏ, ఇద్దరు 9.3 జీపీఏ, ఇద్దరు 9.2 జీపీఏ, ఏడుగురు 9.0 జీపీఏ సాధించారన్నారు. పాఠశాలలో మొత్తం 74 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 72 మంది ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఆయనతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

'సిద్ధార్థ' విద్యార్థుల విజయకేతనం



అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థులతో డైరెక్టర్ శ్రీపాల్‌రెడ్డి

సప్తగిరికాలనీ(కరీంనగర్): పదోతరగతి ఫలితాల్లో కరీంనగర్‌లోని సిద్ధార్థ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. అత్యుత్తమ జీపీఏ గ్రేడ్ పాయింట్లు సాధించినట్లు విద్యాసంస్థల డైరెక్టర్ దాసరి శ్రీపాల్ రెడ్డి తెలిపారు. 11 మంది 10 జీపీఏ, 14 మంది 9.8 జీపీఏ, 21 మంది 9.7 జీపీఏ, 125 మంది 9.0, ఆపైన జీపీఏ సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను ఆయనతోపాటు ప్రిన్సిపాళ్లు, వైస్ ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు అభినందించారు. తమ విద్యాసంస్థల నుంచి మొత్తం 238 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవగా 99 శాతం మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు.

స్విమ్మింగ్ పూల్‌ను వినియోగంలోకి తేవాలి

- ఏఐటీయూసీ ఆర్జీ–1 ఉపాధ్యక్షుడు రంగు శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్, పక్కన నాయకులు

గోదావరిఖని(రామగుండం): వేసవి సెలవుల్లో కార్మికుల పిల్లలకు ఉపయోగపడాల్సిన స్విమ్మింగ్ పూల్ మూసివేశారని ఏఐటీయూసీ ఆర్జీ–1 ఉపాధ్యక్షుడు రంగు శ్రీనివాస్ అన్నారు. గురువారం గోదావరిఖనిలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం రూ.లక్షలు వెచ్చించి, కార్మికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ పూల్ నిర్వహణను యాజమాన్యం మర్చిపోయిందని ఆరోపించారు. ఈత నేర్చుకోవడం కోసం వస్తున్న కార్మికులు, వారి పిల్లలు స్విమ్మింగ్ పూల్‌లో నీరు లేకపోవడం వల్ల వేసవి సెలవుల్లో నిరాశగా వెనుదిరుగుతున్నారని అన్నారు. సంస్థ సొమ్ము కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయకుండా ప్రభుత్వానికి అప్పగిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం స్పందించి, బోర్‌వెల్ వేసి, స్విమ్మింగ్ పూల్‌లో నీటిని నింపి, వినియోగంలోకి తేవాలని కోరారు. జీడీకే–2వ గని అండర్ బ్రిడ్జిపై వర్షం పడిన సమయాల్లో ద్విచక్ర వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే జీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. నాయకులు తిరుపతి, శనగల శ్రీనివాస్, తాని రాజబాబు, ఆకునూరి శంకరయ్య, చెప్యాల భాస్కర్, తొడుపునూరి రమేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తుల రక్షణలో అప్రమత్తంగా ఉండాలి

- సింగరేణి చీఫ్ సెక్యూరిటీ అధికారి హన్మంతరావు



సీహెచ్‌పీ ప్రాంతంలో పరిశీలిస్తున్న జీఎం హన్మంతరావు

గోదావరిఖని(రామగుండం): సింగరేణి ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చీఫ్ సెక్యూరిటీ అధికారి హన్మంతరావు అన్నారు. గురువారం ఆర్జీ–1 ఏరియాలో ఆయన ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా మూసివేసిన మేడిపల్లి ఓపెన్ కాస్ట్ ప్రాంతాన్ని పరిశీలించారు. బేస్ వర్క్‌షాప్, సర్ఫేస్ క్యాంటీన్, బంకర్ ఏరియాల్లోని పాత కేబుళ్లు, స్క్రాప్‌ను తొందరగా తరలించాలన్నారు. సింగరేణి స్థలాలను కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట మేడిపల్లి మేనేజర్ మల్లికార్జున్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి, జూనియర్ ఇన్‌స్పెక్టర్, జె.ఉమేశ్, చంద శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్మికులకు 35 శాతం వాటా చెల్లించాలి

- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సత్తయ్య

గోదావరిఖని(రామగుండం): 2022–23 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సంస్థ సాధించిన వాస్తవ లాభాలను ప్రకటించి, అందులో 35 శాతం వాటా కార్మికులకు చెల్లించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆర్జీ–2 ఏరియా వకీల్‌పల్లి గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో రూ.32,830 కోట్ల టర్నోవర్ ప్రకటించారన్నారు. అదే వాస్తవ లాభాలను ప్రకటించడంలో యాజమాన్యం జాప్యం చేస్తోందని ఆరోపించారు. రక్షణ విషయంలో కోలిండియా యాజమాన్యం వైఫల్యం చెందుతోందన్నారు. దీనికి వ్యతిరేకంగా ధన్‌బాద్‌లోని డీజీఎంఎస్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు పేర్కొన్నారు. నాయకులు వడ్డేపల్లి కుమారస్వామి, వై.సారంగపాణి, మాదాసి రవీందర్, యాదగిరి నరేశ్, నీలం శ్రీనివాస్, ముదాం సత్తయ్య, ప్రమోద్‌కాషాల్ తదితరులు పాల్గొన్నారు.

భారీ యంత్రాల్లో క్యాబిన్‌ను మార్చండి

- ఆర్జీ–2 జీఎం మనోహర్
- కోమట్స్, ఎల్‌అండ్‌టీ ప్రతినిధులతో సమావేశం



మాట్లాడుతున్న జీఎం మనోహర్

గోదావరిఖని(రామగుండం): ఓసీపీలో నడుస్తున్న భారీ యంత్రాల కంపెనీలు ఎల్‌అండ్‌టీ, కోమట్స్ ప్రతినిధులతో ఆర్జీ–2 జీఎం మనోహర్ గురువారం సమావేశమయ్యారు. బేస్ వర్క్‌షాప్‌లో కోమట్స్ యంత్రాల పనితీరును పరిశీలించారు. వాటి సామర్థ్యం, రక్షణ పరమైన ఇబ్బందులు తదితర అంశాలపై చర్చించారు. మన దేశ రోడ్డు రవాణా విధానానికి అనుగుణంగా భారీ యంత్రాల్లో క్యాబిన్ కుడి వైపు ఉండేలా మార్పులు చేయాలన్నారు. అలాగే ఆపరేటర్లకు రక్షణకు సంబంధించిన ఏర్పాట్లపై కంపెనీ ప్రతినిధులకు తగు సూచనలు చేశారు. సమావేశంలో ప్రాజెక్టు ఇంజినీర్ దుర్గాప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

రెస్క్యూ స్టేషన్‌ను సందర్శించిన డీఎంఎస్



డీఎంఎస్‌ను సన్మానిస్తున్న రెస్క్యూ అధికారులు

గోదావరిఖని(రామగుండం): సింగరేణి మెయిన్ రెస్క్యూ స్టేషన్‌ను డీఎంఎస్ ఐ.సత్యనారాయణ గురువారం సందర్శించారు. ఎమర్జెన్సీలో కీలక పాత్ర పోషిస్తున్న సింగరేణి రెస్క్యూ బృందాన్ని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా డీఎంఎస్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రెస్క్యూ సూపరింటెండెంట్ మాధవరావు, మేనేజర్ భాస్కర్‌రెడ్డి, తిరుపతి, బ్రిగేడియర్లు పాల్గొన్నారు.

యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించండి



మాట్లాడుతున్న జీఎం వెంకటేశ్వర్‌రావు, పక్కన అధికారులు

కమాన్‌పూర్(మంథని): సింగరేణి సంస్థ ఆర్జీ–3 పరిధిలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలంటే పని గంటలు పెంచి, యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించాలని ఆర్జీ–3 జీఎం తన్నీరు వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన తన కార్యాలయంలో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాలను రక్షణతో సాధించుకోవాలని, యంత్రాలను 18 గంటలపాటు నడిచేలా చూడాలని, అధికారులు, ఉద్యోగులు, ఆపరేటర్లు కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. రక్షణ విషయంలో ఎలాంటి అశ్రద్ధ వద్దన్నారు. గతేడాది భారీ యంత్రాలు సాధించిన ఉత్పత్తి లక్ష్యాలు, ఈ ఆర్థిక సంవత్సరంలో సాధించాల్సినవి, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో ఏరియా ఇంజినీర్ ఎలిషా, ఫైనాన్స్ జీఎం పి.శ్రీనివాసులు, ప్రాజెక్టు అధికారులు ఎస్.రాధాకృష్ణ, ఎం.నరేందర్, ఏరియా రక్షణ అధికారి సీహెచ్.వెంకటరమణ, ప్రాజెక్టు ఇంజినీర్లు ఆర్.శ్రీనివాస్, ఎం.నాగరాజు, డీజీఎం ఐఈడీకే చంద్రశేఖర్, మేనేజర్ ఉదయ్‌హరిజన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ–3 జీఎంను కలిసిన సివిల్ జీఎం



సివిల్ జీఎం సూర్యనారాయణను సన్మానిస్తున్న జీఎం వెంకటేశ్వర్‌రావు

కమాన్‌పూర్(మంథని): సింగరేణిలో నూతన సివిల్(కార్పొరేట్)జీఎంగా బాధ్యతలు చేపట్టిన సూర్యనారాయణ గురువారం ఆర్జీ–3 జీఎం తన్నీరు వెంకటేశ్వర్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను జీఎంతోపాటు అధికారులు శాలువాలతో సత్కరించారు. ఎస్‌వోటూ జీఎంలు బైద్య, రఘుపతి, ఏరియా ఇంజినీర్ సీతారామం, ఫైనాన్స్ ఏజీఎం శ్రీనివాసులు, ఏరియా రక్షణ అధికారి సీహెచ్.వెంకటరమణ, పర్సనల్ డీజీఎం చంద్రశేఖర్, డీజీఎం సుధాకర్, సివిల్ ఎస్ఈ పద్మరాజు, అధికారుల సంఘం ప్రతినిధి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.